

ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు దరఖాస్తులు

పార్వతీపురం, ఆగస్టు21(ఆంధ్రజ్యోతి): గురుపూజోత్సవం సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు-2024కు సంబంధించి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు డీఈవో జి.పగడాలమ్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబరు-5 టీచర్స్‌డే పురస్కరించుకుని జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో అర్హత కలిగిన ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన టీచర్లు సంబంధిత మండల విద్యాశాఖాధికారి, ఉప విద్యాశాఖాధికారి ద్వారా ఈ నెల 21 నుంచి 27లోపు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా విద్యా శాఖాధికారి సూచించారు.


అసంపూర్తిగానే..

- గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సక్రమంగా సాగని భూముల రీ సర్వే
- సీతంపేట ఏజెన్సీలో సగంలోనే నిలిచిపోయిన ప్రక్రియ
- 118 రెవెన్యూ గిరిజన గ్రామాల్లో కేవలం తొమ్మిది చోట్లే నిర్వహణ
- అత్యధికులకు పట్టాదారు పాస్‌బుక్‌లు అందించని వైనం
- ఇబ్బందుల్లో గిరిజన రైతులు
- నూతన ప్రభుత్వంపైనే ఆశలు



రీ సర్వే చేసిన చినరామ బౌండరీ భూమి

సీతంపేట రూరల్, ఆగస్టు 21: భూ సమస్యల పరిష్కారానికే రీ సర్వే అంటూ గత వైసీపీ ప్రభుత్వం గొప్పలు చెప్పింది. కానీ క్షేత్రస్థాయిలో ఈ ప్రక్రియ సక్రమంగా సాగలేదు. సీతంపేట ఏజెన్సీలో నెలకొన్న పరిస్థితులే ఇందుకు నిదర్శనంగా చెప్పొచ్చు. అప్పట్లో మండలంలో చేపట్టిన భూ సర్వే పూర్తిస్థాయిలో జరగలేదు. సర్వే పూర్తయిన గ్రామాల్లో గిరిజన రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు కూడా అందించలేదు. దీంతో ఆయా ప్రాతవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాస్తవంగా 2021లో వైసీపీ ప్రభుత్వ ఆదేశాల మేరకు.. మండల రెవెన్యూ సిబ్బంది ఆగమేఘాల మీద రీ సర్వేకు చర్యలు చేపట్టారు. అప్పట్లో 53 పంచాయతీల పరిధిలోని 118 రెవెన్యూ గిరిజన గ్రామాల్లో ఈ ప్రక్రియ చేపట్టాలని ప్రణాళికలు రూపొందించారు. అయితే మేకవ, చినరామ, కొండపేట, అడ్డాకులగూడ, పనుకువలస, గడిగుడ్డి, బర్న, కిరప, వాబ తదితర తొమ్మిది గ్రామాల్లో 389.92 ఎకరాల్లోనే రీ సర్వే పూర్తిచేశారు. కొన్ని రెవెన్యూ గిరిజన గ్రామాల్లో సిగ్నల్ అందకపోవడం, డ్రోన్ ఫై వైఫల్యం కారణంగా భూముల రీ సర్వే సగంలోనే నిలిచిపోయింది. కాగా సర్వే పూర్తయిన గామాల్లో చాలామంది గిరిజనులకు పట్టాదారు పాస్ పుస్తకాలు అందించలేదు. దీంతో సుమారు వందమంది నూతన పట్టాదారు పాస్ పుస్తకాల కోసం తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది.



అప్పట్లో కొందరికే అందిన పట్టాదారు పాస్ పుస్తకాలు

పాస్ పుస్తకాలు లేక..

చినరామ రెవెన్యూ గ్రామం పరిధిలో 104 మంది రైతులకు చెందిన భూముల్లో రీ సర్వే చేశారు. అయితే వాటిల్లో 90మందికి మాత్రమే పాస్ పుస్తకాలు అందాయి. మిగిలిన వారికి అందించకపోవడంతో అడంగల్, 1బీలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆ గ్రామానికి చెందిన రైతులు బిడ్డిక శ్రీరాములు, కుండంగి చంద్రయ్య, బిడ్డిక రామారావు, సింహాచలం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్యాంక్ రుణాలు కూడా పొందలేకపోతున్నామని వారు వాపోతున్నారు. కాగా మిగిలిన 8 రెవెన్యూ గ్రామాల్లో సుమారుగా 100 మంది గిరిజన రైతులు కూడా పట్టాదారు పాస్ పుస్తకాలు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నూతన ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఆర్ఎస్‌డీటీ ఏమన్నారంటే..

'సీతంపేట మండలంలో 118 రెవెన్యు గిరిజన గ్రామాలకు గాను 9 గ్రామాల్లో మాత్రమే జగనన్న భూ హక్కు సర్వే పూర్తయింది. 2021లో గజిలి గ్రామ పరిసరాల్లో సర్వే చేస్తున్న సమయంలో సిగ్నల్ లేని కారణంగా డ్రోన్ పై అవుతూ కొండను ఢీకొట్టింది. ఈ కారణంగా మిగిలిన రెవెన్యు గ్రామాల్లో సర్వే పూర్తి కాలేదు. సర్వే పూర్తయిన గిరిజన గ్రామాల్లో కొంత మందికి మాత్రమే పాస్ పుస్తకాలు పంపిణీ చేయలేదు. మిగిలిన వారందరికీ అందజేశాం.' అని రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ శ్రీవిద్య తెలిపారు.



గజిలిలో రీ సర్వే జరగని భూమి

ఆ ఇద్దరి మధ్య.. కుర్చీ రగడ

- గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాళ్ల గొడవ
- ఐటీడీఏ ఏపీవో దృష్టికి పంచాయితీ
- గురుకుల కార్యదర్శిదే తుది నిర్ణయం



సీతంపేట గురుకుల పాఠశాల

సీతంపేట: సీతంపేట గురుకుల పాఠశాలలో ఇద్దరు ప్రిన్సిపాళ్ల మధ్య కుర్చీ రగడ మొదలైంది. ఈ పంచాయితీ ఐటీడీఏ ఏపీవో వద్దకు చేరింది. అయితే గురుకుల కార్యదర్శి దీనిపై తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. వాస్తవంగా గురుకుల సొసైటీలో పనిచేస్తున్న సిబ్బందిలో కొంతమంది జూన్ 30న ఉద్యోగ విరమణ చెందారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా తమకు కూడా 62 సంవత్సరాల వయోపరిమితిని వర్తింపజేయాలని వారిలో కొంతమంది గత ప్రభుత్వాన్ని కోరారు. వైసీపీ సర్కారు నుంచి ఎటువంటి అనుమతులు లేకపోవడంతో వీరంతా హైకోర్టును ఆశ్రయించారు. వారిని విధుల్లో కొనసాగించాలని, దీనికి సంబంధించి ఆరు నెలలు గడువు ఇస్తున్నట్లుగా హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు జూన్ 30న ఉద్యోగ విరమణ చేసిన గురుకుల సిబ్బంది హైకోర్టు ఆదేశాలు ప్రకారం విధుల్లో కొనసాగుతున్నారు. అయితే ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలు రాకపోవడంతో విధుల్లో కొనసాగించలేమని గురుకుల సొసైటీ అధికారులు హైకోర్టుకు స్పష్టం చేశారు. అయినప్పటికీ న్యాయ స్థానం ఆరు నెలలు విధుల్లో కొనసాగించాలని స్టే విధించడంతో ఉద్యోగ విరమణ చేసిన వారు విధుల్లో కొనసాగుతున్నారు.

ఈ తరుణంలో గురుకుల సొసైటీ కార్యదర్శి గురుకులాల్లో ప్రిన్సిపాళ్లను నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. దీనిలో భాగంగా సీతంపేట బాలుర గురుకుల రెసిడెన్షియల్ పాఠశాల ప్రిన్సిపాల్ తిరుపతిరాజు స్థానంలో సీలేరు గురుకుల పాఠశాలకు చెందిన ఎం.వి.రమణను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఈ నెల 17న ఆయన బాధ్యతలు చేపట్టడానికి సీతంపేట వచ్చారు. అయితే కోర్టు ఉత్తర్వుల మేరకు తాను విధులు నిర్వహిస్తున్నానని.. ప్రిన్సిపాల్ బాధ్యతల నుంచి తప్పుకోలేనని తిరుపతిరాజు స్పష్టం చేశారు. దీంతో వారు ఐటీడీఏ ఏపీవో చిన్నబాబు వద్ద పంచాయితీ పెట్టారు. కార్యదర్శి ఆదేశాల ప్రకారం కొత్తవారికి బాధ్యతలు అప్పగించాలని ఆయన స్పష్టం చేశారు. ఆరు నెలల వరకు విధుల్లో కొనసాగించే విధంగా కోర్టు ఉత్తర్వులు ఇచ్చిందని తిరుపతిరాజు తెలిపారు. దీంతో ఏమీ చేయలేని పరిస్థితుల్లో ఈ అంశాన్ని గురుకుల కార్యదర్శి దృష్టికి తీసుకొని వెళ్లారు. అయితే హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం ఎటువంటి చర్యలు తీసుకుంటారనే దానిపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న ప్రిన్సిపాల్ తిరుపతిరాజును వివరణ కోరగా.. గురుకుల సొసైటీ కార్యదర్శికి వ్యతిరేకం కాదని, హైకోర్టు ఆదేశాల ప్రకారం తాను ప్రిన్సిపాల్‌గా కొనసాగుతానని తెలిపారు.

గ్రామసభలకు ఏర్పాట్లు పూర్తి

పార్వతీపురం, ఆగస్టు21(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పంచాయతీల్లో ఈనెల 23న పారదర్శకంగా గ్రామసభలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. ఇందుకోసం ప్రతి గ్రామంలో కమిటీలు ఏర్పాటు చేసినట్లు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పంచాయతీల్లో గ్రామసభ, వార్డు సభల సిఫారసులను పరిగణనలోకి తీసుకొని అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు తయారు చేస్తామన్నారు. ఉపాధి హామీ పథకంలో వ్యవసాయ అనుబంధ పనులను గుర్తిస్తామని తెలిపారు. సోషల్ ఆడిట్ ప్రాముఖ్యాన్ని ప్రజలకు తెలియజేస్తామన్నారు.

రోగుల వివరాల నమోదు తప్పనిసరి

పార్వతీపురం జిల్లా కేంద్రాసుపత్రిలోని డయాలసిస్ కేంద్రంలోని చికిత్స పొందుతున్న రోగుల వివరాలను పక్కాగా నమోదు చేయాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. బుధవారం ఆయన ఆసుపత్రిని ఆకస్మికంగా సందర్శించారు. చిన్నపిల్లల విభాగం, మెటర్నటీ, లేబర్‌వార్డు, ఎస్ఎంసీయూ, డయాలసిస్, ఓపీ విభాగాలను నిసితంగా పరిశీలించారు. ప్రసూతి విభాగంలో బాలింతలు, జ్వర లక్షణాలతో బాధపడుతున్న చిన్నారులతో మాట్లాడారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఆసుపత్రి భవనంలోకి చెమ్మ రావడాన్ని గుర్తించి వెంటనే మరమ్మతులు చేయించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆసుపత్రుల సమన్వయ అధికారి వాగ్దేవి, వైద్యశాఖ అధికారులు వినోద్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ప్రోగ్రాం అధికారిగా లక్ష్మీకాంత్

జిల్లాలో చేపట్టే ప్రత్యేక కార్యక్రమాల పర్యవేక్షణకు ఒక అధికారిని నియమించామని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లో ప్రాజెక్టు మానటరింగ్ యూనిట్ (పీఎంయూ)ను కూడా ఏర్పాటు చేశామన్నారు. హైస్కూల్ ప్లై గ్రేడ్ తదితర కార్యక్రమాలను సమన్వయం చేస్తూ కార్యాచరణ కమిటీ పర్యవేక్షణ చేస్తుందన్నారు. పీఎంయూకు జిల్లా స్థాయి ప్రోగ్రాం అధికారిగా పాచిపెంట ఎంపీడీవో పి. లక్ష్మీకాంత్‌ను నియమించినట్లు ఆయన చెప్పారు. సంబంధిత కార్యక్రమాల అమలు, నివేదికల సేకరణ, విశ్లేషణ తదితర అంశాలను పర్యవేక్షిస్తారని వెల్లడించారు.

షటిల్ బ్యాడ్మింటన్ జాతీయ జట్టు కోచ్‌గా జిల్లావాసి

సాలూరు రూరల్,ఆగస్టు 21: అంతర్జాతీయ షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ఈ నెల 22 నుంచి చైనాలో జరగనున్నాయి. అయితే భారత జట్టుకు కోచ్‌గా సాలూరు మండలం మామిడిపల్లివాసి కనకల వరప్రసాద్ ఉన్నారు. ఈ పోటీల్లో దేశం నుంచి అండర్-15, 17 విభా గంలో జట్లు పాల్గొంటున్నాయి. కాగా 2006 లో మామిడిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో బ్యాడ్మింటన్‌లో ఆయన తర్ఫీదు పొందారు. జిల్లా,రాష్ట్ర, జాతీయ స్థాయిలో పలు పతకాలను పొందారు. నంది పైప్స్ అకాడమీ కోచ్ వెంకట, ఖమ్మం శాప్ బ్యాడ్మింటన్ అకాడమీ కోచ్ సుధాకర్ వద్ద శిక్షణలో మెళకువలు నేర్చుకొని జాతీయస్థాయి సింగిల్స్, డబుల్స్‌లో అనేక పతకాలు సాధిం చారు. భువనేశ్వర్‌లో దిలీప్ వద్ద కోచ్‌గా వ్యవహరించే తీరుపై శిక్షణ పొందారు. ప్రస్తుతం ఆయన అస్సాం షటిల్ బ్యాడ్మింటన్ కోచ్‌గా పనిచేస్తున్నారు. చైనాలో జరిగే అంత ర్జాతీయ పోటీలకు కోచ్‌గా ఆయన ఎంపిక య్యారు.



కోచ్ వరప్రసాద్

ఉపాధిలో అవకతవకలు

- క్షేత్ర సహాయకునిపై ఫిర్యాదు

జియ్యమ్మవలస, ఆగస్టు 21 : జియ్యమ్మవలస మండలంలోని ఉపాధి హామీ పథకంలో అవకతవకలు జరిగినట్లు ఎంపీడీవో పి.శ్రీనివాసరావుకు ఫిర్యాదు అందింది. ఈ మేరకు మొఖాసా అల్లువాడ పంచాయతీ క్షేత్ర సహాయకునిపై విచారణ చేపట్టాలని గ్రామస్థులు కోరారు. చనిపోయిన, ఇతర ప్రాంతాల్లో ఉన్నవారు, మంచంపై కదల్లేని స్థితిలో ఉన్న వారి పేరున వేతనాలు మంజూరు చేసినట్లు అందులో పేర్కొన్నారు.

అక్రమంగా వేతనాలు జమ

- గ్రామంలో ఈగల గంగ (జాబ్ కార్డు నెంబరు 20002) 2023 జూన్ 7న మరణించింది. ఆమె బ్యాంకు ఖాతాలో రూ. 7197 జమైంది.
- మజ్జి పద్మావతి (జాబ్ కార్డు నెంబరు 10343), మండంగి నక్షత్రమ్మ (జాబ్ కార్డు నెంబరు 10004)లు ఇద్దరూ అంధులే. వారి అకౌంట్లలో రూ. 14,125, రూ.9336 జమయ్యాయి.
- పడాల గణేష్‌బాబు (జాబ్ కార్డు నెంబరు 20126) విజయవాడలో చదువుతుండగా మరో 25 మంది గ్రామాల్లో లేనివారి ఖాతాల్లో డబ్బులు వేశారు.
- ఈ విధంగా వేతనాల్లో రూ. 2,47,120 వరకు అక్రమంగా జమ చేశారని, దీనిపై సమగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ఉపాధి హామీ పథకం సంచాలకులకు ఎంపీడీవో నివేదిక అందజేశారు.

వర్గీకరణ వద్దు

- దళిత ఐక్య వేదిక డిమాండ్
- పలుచోట్ల నిరసనలు
- జిల్లాలో బంద్ పాక్షికం

పార్వతీపురం, ఆగస్టు21(ఆంధ్రజ్యోతి)/పాలకొండ/సాలూరు: 'ఎస్సీ వర్గీకరణ వద్దు.. ఐక్యతే ముద్దు' అని దళిత ఐక్య వేదిక సభ్యులు నినదించారు. ఈ మేరకు బుధవారం పలుచోట్ల నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఎస్సీ వర్గీకరణను నిరసిస్తూ బంద్‌కు పిలుపునిచ్చినప్పటికీ.. జిల్లాలో కొన్నిచోట్ల ఆ ప్రభావం పెద్దగా కనిపించలేదు. పాలకొండ డివిజన్ కేంద్రంలో దళిత యువత, జేఏసీ నాయకులు స్థానిక ఆర్టీసీ డిపో వద్దకు చేరుకుని కొద్దిసేపు బస్సులను నిలుపుదల చేశారు. రోడ్డుపై నిరసన తెలియజేయడంతో ట్రాఫిక్ స్తంభించింది. పట్టణంలో వారు బైక్‌లపై తిరుగుతూ షాపులు, దుకాణాలను మూయించారు.



సాలూరులో నిరసన తెలుపుతున్న దళిత సంఘాల నాయకులు



పాలకొండలోని ఆర్టీసీ డిపో వద్ద నినాదాలు చేస్తున్న దృశ్యం

కొన్నిచోట్ల పాఠశాలలు, కళాశాలలను బంద్ చేయించారు. అనంతరం పట్టణంలోని కార్గిల్ జంక్షన్ వద్ద ఎస్సీ వర్గీకరణ భూతం దిష్టిబొమ్మను దహనం చేసి మానవహారం చేపట్టారు. ఈ బంద్‌లో డివిజన్ దళిత సీనియర్ నాయకులు లిల్లీపుష్పనాథం, భరత్‌భూషణ్, జిల్లా వర్గీకరణ వ్యతిరేక సమితి అధ్యక్షుడు మోహన్‌రావు, దళిత, ఉద్యోగ సంఘాల నాయకులు జాన్, తిర్లంగి ఉపేంద్ర, బబ్బురు గణేష్, జీవరత్నం, నాగరాజు, శంకరరావు పాల్గొన్నారు. ఇక సాలూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట రోడ్డుపై దళిత సంఘాల నాయకులు బైఠాయించి నిరసన తెలిపారు. అక్కడ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు ర్యాలీ నిర్వహించారు. కొద్దిసేపు బస్సులను అడ్డుకుని నినాదాలు చేశారు. అయితే ఎవరికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. ఈ నిరసనలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ముగడ గంగమ్మ, నాయకులు గొంప ప్రకాష్, సింగారపు ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. జిల్లా కేంద్రం పార్వతీపురంలో బంద్ ప్రభావం పాక్షికంగానే ఉంది. యథావిధిగానే బస్సుల రాకపోకలు సాగాయి. దుకాణాలన్నీ తెరచుకున్నాయి. పాఠశాలలు, కళాశాలలు పనిచేశాయి. బంద్ నేపథ్యంలో జిల్లాకేంద్రంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జగరకుండా పోలీసులు అప్రమత్తమయ్యారు.

ఎన్నాళ్లీ డోలీ మోతలు

కొమరాడ, ఆగస్టు 21: ఏజెన్సీ వాసులకు డోలీ మోతలు తప్పడం లేదు. ఏళ్లు గడుస్తున్నా.. వారి కష్టాలు తీరడం లేదు. కెమిశీల పంచాయతీ గాజులగూడకి చెందిన గర్భిణి హిమరిక రజనీకి నెలల నిండడంతో బుధవారం పురిటి నొప్పులు వచ్చాయి. గ్రామానికి సరైన రహదారి లేకపోవడంతో ఆ గ్రామ గిరిజనులు మంచాన్ని డోలీగా మార్చారు. సుమారు రెండు కిలో మీటర్లు మోసుకుంటూ.. కాలినడకన కెమిశీల వరకు వచ్చారు. అక్కడ ఫీడర్ అంబులెన్స్‌లో రజనీని ఎక్కించి.. మాదలంగి పీహెచ్‌సీకి చేరారు. ఆమె అక్కడ ప్రసవించింది. పండంటి పాపకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు చెప్పారు. అయితే తరాలు మారినా తమ తలరాతలు మారడం లేదని గిరిజనులు వాపోతున్నారు. అత్యవసర వేళల్లో వైద్యసేవలు అందడం లేదని, తరచూ డోలీ మోతలు తప్పడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి తమ గ్రామాలకు పక్కా రహదారులు నిర్మించాలని ఆ ప్రాంతవాసులు కోరుతున్నారు.



మంచంపై గర్భిణీని తీసుకొస్తున్న గాజులగూడ గ్రామ గిరిజనులు

గత వైసీపీ పాలన ఫలితం

- అధ్వానంగా బిల్లుమడ రహదారి
- పూటకో చోట కూరుకుపోతున్న లారీలు



బిల్లుమడ వద్ద రోడ్డుపై బురదలో కూరుకుపోయిన లారీ

భామిని: గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా భామిని మండలంలోని బిల్లుమడ రహదారి అధ్వానంగా మారింది. దారి పొడవునా భారీ గోతులతో ప్రమాదాలకు కేరాఫ్‌గా నిలిచింది. ఇటీవల కురిసిన వర్షాలకు ఈ రోడ్డు బురదమయంగా మారడంతో బిల్లుమడ, పసుకుడి మధ్యలో పూటకో చోట లారీలు కూరుకు పోతున్నాయి. తరచూ ట్రాఫిక్ స్తంభిస్తుండడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో బిల్లుమడ రోడ్డుపై గోతిలో ఓ లారీ దిగబడింది. దానిని తొలగించడానికి మూడు గంటల సమయం పట్టింది. అదే సమయంలో సింగిడి వద్ద రోడ్డుపై మరో లారీ కూరుకుపోవడంతో మరో రెండు గంటల పాటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. ఆర్టీసీ బస్సులు ఆలస్యంగా తిరగడంతో విద్యార్థులకు పడిగాపులు తప్పలేదు. ఇదిలా ఉండగా సింగిడి-బిల్లుమడ రోడ్డులో చెన్నై నుంచి ఒడిశాకు భారీ వాహనాలు వెళ్తున్నాయి. అయితే అవి ఏ గుంతలోనైనా దిగబడితే.. బత్తిలి వైపు వాహన రాకపోకలు నిలిచిపోయే అవకాశం ఉందని వాహనదారులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఆయా ప్రాంతవాసులు కోరుతున్నారు.



సింగిడి వద్ద రోడ్డుపై గుంతలో దిగబడిన లారీ

పంచాయతీలకు మంచి రోజులు

- 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల
- హామీ నెరవేర్చిన ప్రభుత్వం
- ఆనందంలో సర్పంచ్‌లు

పార్వతీపురం, ఆగస్టు21(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ పాలనలో పూర్తిగా నిర్లక్ష్యానికి గురైన పంచాయతీలకు మంచి రోజులొస్తున్నాయి. జిల్లాలోని 451 పంచాయతీలకు కూటమి ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు చేసింది. ఈ మేరకు బుధవారం పంచాయతీల ఖాతాల్లో రూ.9.57 కోట్లను జమ చేసింది. దీంతో సర్పంచ్‌లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాలకు మంజూరయ్యే నిధుల స్థాయిని బట్టి అభివృద్ధి పనులు చేసే అవకాశం దక్కిందని వారు అభిప్రాయపడుతున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం పంచాయతీలకు ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయడంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

గతంలో ఇలా..

గత వైసీపీ ప్రభుత్వం పంచాయతీలను పూర్తిగా గాలికొదిలేసింది. పంచాయతీలకు మంజూరైన అభివృద్ధి నిధులను తన సొంత అవసరాలకు వినియోగించుకుని సర్పంచ్‌లను ఉత్సవ విగ్రహాలుగా మార్చింది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఆర్థిక సంఘం నిధులను సైతం మళ్లించేసింది. విద్యుత్ చార్జీల బకాయిల పేరిట నిధుల్లో భారీగా కోతలు విధించింది. దీంతో గ్రామాల్లో అభివృద్ధి పడకేసింది. రహదారులు, కాలువలు, తాగునీరు, పారిశుధ్య సమస్యలను కూడా సర్పంచ్‌లు పరిష్కరించలేకపోయేవారు. కేంద్రం నిధులు మళ్లించడంపై వారు నిరసన కార్యక్రమాలు చేపట్టినా.. గత వైసీపీ సర్కారు పట్టించుకోలేదు. అయితే కూటమి ప్రభుత్వం సర్పంచ్‌లకు ఇచ్చిన మాట ప్రకారం.. ఆర్థిక సంఘం నిధులు విడుదల చేసి స్థానిక సంస్థల్లో ఉత్సాహాన్ని నింపింది.



తిరుమలలో చిరంజీవి

● కుటుంబ సభ్యులతో కలసి నేడు శ్రీవారి దర్శనం

మెగాస్టార్ చిరంజీవి శ్రీవారి దర్శనార్థం బుధవారం తిరుమలకు చేరుకున్నారు. రాత్రి 8గంటలకు తిరుమలలోని ఫీనిక్స్ అతిథిగృహానికి చేరుకున్న ఆయనకు టీటీడీ రిసెప్షన్ అధికారులతో పాటు అభిమానులు స్వాగతం పలికారు. చిరంజీవితో పాటు ఆయన సతీమణి సురేఖ, తల్లి అంజనా దేవి కూడా తిరుమలకు చేరుకున్నారు. అంతకుముందు సాయంత్రం కుమార్తె శ్రీజ కాలినడకన తిరుమలకు చేరుకున్నారు. గురువారం చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా ఆలయంలో వేకువజామున జరిగే సుప్రభాతసేవలో పాల్గొని శ్రీవారిని దర్శించుకోనున్నారు.


తిరుమల, (ఆంధ్రజ్యోతి)

బ్లాక్‌బస్టర్ పక్కా



నాని, ప్రియాంక మోహన్ జంటగా నటించిన పాన్ ఇండియా చిత్రం 'సరిపోదా శనివారం'. ఎస్.జే సూర్య, సాయికుమార్ కీలక పాత్రలు పోషించారు. వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి నిర్మించారు. ఇప్పటికే విడుదలైన టీజర్, పాటలు, ట్రైలర్ అందరినీ ఆకట్టుకుని సినిమాపై అంచనాలను పెంచేశాయి. ఈ నెల 29న సినిమా విడుదలవుతోన్న సందర్భంగా చిత్రబృందం మీడియాతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో నాని మాట్లాడుతూ "ఈ సినిమా కోసం చిత్రబృందం ఎంతో కష్టపడింది. ఆ కష్టం తెరపై కనపడుతుంది. వారి కోసం ఈ సినిమా పెద్ద హిట్టవ్వాలి. ఈ సినిమాకు వివేక్ రైటింగ్, జేక్స్ బిజోయ్ సంగీతం స్పెషల్ అట్రాక్షన్. నాకు కోపం వచ్చింది. అలా కోపం వచ్చిందంటే బ్లాక్‌బస్టర్ పక్కా" అని చెప్పారు. "ఈ సినిమాలో ఎస్.జే. సూర్య, నాని పోటాపోటీగా నటించారు. వివేక్ నుంచి ఇటువంటి కమర్షియల్ సినిమా అస్సలు ఊహించలేదు. సినిమాను డైరెక్టర్ ఓ రేంజ్‌లో తీశారు" అని దిల్‌రాజు అన్నారు. "ఈ సినిమాకు కథే బలం. సినిమా అద్భుతంగా వచ్చింది" అని చిత్ర నిర్మాత డి.వి.వి.దానయ్య తెలిపారు.

ముఫాసాకు మహేశ్ వాయిస్



ప్రపంచవ్యాప్తంగా అందరినీ ఆకట్టుకున్న 'ది లయన్ కింగ్' చిత్రానికి ఇప్పుడు సీక్వెల్ వస్తోంది. 'ముఫాసా ది లయన్ కింగ్' పేరుతో వస్తున్న ఈ చిత్రం తెలుగు వెర్షన్‌లో ముఫాసాకు మహేశ్‌బాబు వాయిస్ అందిస్తుండడం ఆసక్తికరం. ఈ సినిమా హిందీ వెర్షన్‌కు షారుఖ్ ఖాన్ డబ్బింగ్ చెప్పారు. తెలుగు వెర్షన్‌లో పుంబా పాత్రకు బ్రహ్మానందం, టిమోన్ పాత్రకు అలీ డబ్బింగ్ చెప్పారు. తెలుగు వెర్షన్ ట్రైలర్‌ను ఈ నెల 26న విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా మహేశ్ మాట్లాడుతూ 'డిస్నీతో అనుబంధం నాకు ప్రత్యేకమైంది. తన కొడుకు అంటే అభిమానం కలిగిన పాత్ర ముఫాసా. అంతేకాదు అడవికి రారాజు. ఆ పాత్రకు నేను వాయిస్ అందించడం నా పిల్లలతో ఎంతో ఆనందంగా సెలబ్రేట్ చేసుకునే సందర్భం ఇది' అన్నారు. డిసెంబర్ 24న 'ముఫాసా ది లయన్ కింగ్' విడుదలవుతుంది.



సిద్ధు కోసం శ్రీనిధి

సిద్ధు జొన్నలగడ్డ తాజా చిత్రం 'తెలుసు కదా' చిత్రం షూటింగ్ హైదరాబాద్‌లో కొనసాగుతోంది. స్టైలిస్ట్ నీరజ కోన ఈ సినిమాతో దర్శకురాలిగా పరిచయమవుతున్నారు. ఇందులో రాశీ ఖన్నా శ్రీనిధి శెట్టి హీరోయిన్లుగా నటిస్తుండగా, తాజా షెడ్యూల్‌లో శ్రీనిధి జాయిన్ అయ్యారు. కీలకమైన సన్నివేశాల చిత్రీకరణ జరుగుతోంది. ఈ చిత్రానికి సహ నిర్మాత: వివేక్ కూచిభొట్ల, నిర్మాత: టీజీ విశ్వప్రసాద్.

తెలుగులోనూ ఆదరిస్తారు



హారర్ థ్రిల్లర్‌గా ప్రేక్షకులను భయపెట్టిన 'డీమాంటి కాలనీ'కి సీక్వెల్‌గా తెరకెక్కిన తమిళ చిత్రం 'డీమాంటీ కాలనీ 2'. అజయ్.ఆర్.జ్ఞానముత్తు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాను బి.సురేశ్ రెడ్డి, బి.మానస రెడ్డి నిర్మించారు. అరుల్‌నిధి, ప్రియా భవానీశంకర్ ముఖ్య పాత్రల్లో నటించారు. సినిమా ఈ శుక్రవారం విడుదలవుతోన్న సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్య అతిథి రామ్‌గోపాల్ వర్మ మాట్లాడుతూ "మంచి కంటెంట్ ఉన్న ఇలాంటి సినిమాను తెలుగులోను ఆదరిస్తారు" అని చెప్పారు. "ఈ సినిమాకు కొనసాగింపుగా మరో రెండు భాగాలు ఉంటాయి" అని దర్శకుడు అజయ్.ఆర్.జ్ఞానముత్తు అన్నారు.

అద్భుతమైన కంటెంట్‌తో 'రేవు'



వంశీ రామ్ పెండ్యాల, అజయ్, స్వాతి భీమిరెడ్డి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'రేవు'. హరినాథ్ పులి దర్శకత్వంలో డా.మురళి గింజుపల్లి, నవీన్ పారుపల్లి నిర్మించారు. సీనియర్ జర్నలిస్టులు ప్రభు దర్శకత్వ పర్యవేక్షణ చేపట్టగా, పి.రాంబాబు ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా వ్యవహరించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతున్న సందర్భంగా చిత్రబృందం మీడియాతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు హరినాథ్ మాట్లాడుతూ "ఈ సినిమా కంటెంట్ అద్భుతంగా ఉంటుంది. అందరూ మెచ్చే చిత్రమిది" అని అన్నారు. "ఈ సినిమాను థియేటర్‌లో చూసి ఎగ్జైట్ అవుతారు" అని నిర్మాత డా.మురళి గింజుపల్లి అన్నారు.

దిక్సూచి

SCHOLARSHIP ALERT

Reliance Foundation Undergraduate

Description: The Reliance Foundation Under graduate Scholarships aim to support meritorious students from all corners of the country in pursuing their undergraduate education. This empowers them to continue their studies, be come successful professionals, and realize their dreams, unlocking their potential to uplift themselves and their communities and contribute towards India's future socio-economic development.

Eligibility: Students must be enrolled in the first year of a full-time regular undergraduate (UG) de gree in any stream at a recognised Indian institute. ● Must have passed Class 12 with a minimum of 60% marks. ● The annual household income should be up to INR 15,00,000 per year (preference will be given to those students whose family income is less than INR 2,50,000)

● Open for resident Indian citizens only. An aptitude test is mandatory.

Prizes & Rewards: Up to INR 2,00,000 over the duration of the degree

Last Date to Apply: 06-10-2024

Application mode: Online only

Short Url: ww.b4s.in/aj/RFS11

SBIF Asha

Description: The SBIF Asha Scholarship Program 2024, one of India's largest scholarship programs, is an initiative of the SBI Foundation. This scholarship aims to provide financial assistance to meritorious students from low-income families across India, ensuring the continuity of their education.

Eligibility: Open to school students from Class 6 to 12 and undergraduate & postgraduate students from the top 100 NIRF universities/colleges, undergraduate students from IITs, and students pursuing MBA/PGDM courses from IIMs. Applicants must have scored a minimum of 75% marks in the previous academic year. Their gross annual family income must be up to INR 6 lakh (Up to INR 3 lakh for Class 6-12 students).

Prizes & Rewards: **Classes 6 to 12:** INR 15,000 each


- **UG Students:** Up to INR 50,000
- **PG Students:** Up to INR 70,000
- **UG Students from IITs:** Up to INR 2,00,000
- **MBA Students from IIMs:** Up to INR 7,50,000


Last Date: 01-10-2024 ***Short Url:*** www.b4s.in/aj/SBIFS7

buddy4study.com

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్‌ఎల్ https://ejyothy.com/LAnmSITలో చదవండి.









గ్రామసభల్లో ప్రజలంతా పాల్గొనాలి

కలెక్టరేట్: జిల్లా వ్యాప్తంగా ఈనెల 23న అన్ని గ్రామాల్లో జరగనున్న గ్రామ సభలను విజయవంతం చేయాలని కలెక్టరు అంబేడ్కర్ తెలిపారు. బుధవారం సాయంత్రం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ గ్రామ సభల నిర్వహణపై కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరు పాల్గొన్నారు. అనంతరం నోడల్ అధికారులతో కలెక్టరు మాట్లాడుతూ ఈనెల 23న జిల్లాలోని 775 గ్రామ పంచాయితీల్లో ఒక రోజున గ్రామ సభలు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి గ్రామసభకు ఒక ప్రత్యేకాధికారిని నియమించాలని చెప్పారు. కార్యక్రమంలో డీపీవో శ్రీధర్ రాజా, డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తి పాల్గొన్నారు.

ఎంఆర్ కళాశాలలో 'జనంలోకి మనం'

విజయనగరం రింగురోడ్డు: మహారాజా కళాశాల సెమినార్ హాల్లో బుధవారం తపాలాశాఖ, మహారాజా కళాశాల సంయుక్తంగా డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ద్వారా 'జనంలోకి మనం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న తపాలాశాఖ ఏఎస్పీ సుందరనాయుడు మాట్లాడుతూ, తపాలాశాఖలో పథకాలను వివరించారు. తపాలాశాఖలో పొదుపు బంగారు భవిష్యత్తుకి మార్గమన్నారు. కార్యక్రమంలో ఐపీబీపీ మేనేజరు సతీష్, పీఆర్‌ఓ మధు తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

బొబ్బిలి రూరల్: మండలంలోని అలజంగి గ్రామంలోని సీబీఎం పాఠశాల విద్యార్థులకు సామాజికవేత్త పి సన్యాసినాయుడు బ్యాగ్‌లు, పుస్తకాలు ఉచితంగా పంపిణీ చేశారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోజెస్, కృష్ణదాస్ పాల్గొని సన్యాసినాయుడును అభినందించారు.

ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం

శృంగవరపుకోట రూరల్: మండలంలోని వీరనారాయణం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం హెచ్ఎం సూరిదేముడు, జీవశాస్త్ర ఉపాధ్యాయుడు అశోక్ రాజు ఆధ్వర్యంలో చైల్డ్‌ఫండ్ ఇండియా ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతినిధులు మాట్లాడుతూ వ్యాధిగ్రస్థులను అంటరాని వారిగా చూడకూడదని, వారికి నిరంతరం ధైర్యం చెప్పాలని సూచించారు.

గురుకుల పాఠశాల తనిఖీ

శృంగవరపుకోట రూరల్: మండలంలోని తాటిపూడి గురుకుల పాఠశాలను ఏంఈవో నరసింగరావు బుధవారం పరిశీలించారు. పాఠశాల ప్రిన్సిపాల్ సంధ్యతో మాట్లాడుతూ విద్యార్థులకు భోజనం ఆలస్యంగా పెట్టడానికి కారణాలు, జనరేటర్ మరమ్మతులు వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏంఈవో మాట్లాడుతూ పత్రికల్లో వచ్చిన కథనాలపై జిల్లా విద్యా శాఖాధికారి నివేదిక ఇమ్మని ఆదేశించారని, దీనిపై విచా రణ జరిపామన్నారు. నివేదికను డీఈవోకు సమర్పిస్తామన్నారు.

తాత్కాలికంగా వంతెనపై నుంచి రాకపోకలకు అనుమతి

బొబ్బిలి రూరల్: మండలంలోని పారాది గ్రామం వద్ద మరమ్మతు పనులు పూర్తి చేసిన తాత్కాలిక వంతెనపై నుంచి అన్ని రకాల భారీవాహనాల రాకపోకలు జరపడానికి గురువారం నుంచి అనుమతి ఇచ్చారని బొబ్బిలి పోలీసులు తెలిపారు. పాత బ్రిడ్జి మీదుగా కేవలం లైట్ మోటార్ వెహికల్స్, ద్విచక్రవాహనాలు మాత్రమే రాకపోకలకు అనుమతి ఉంటుందని అటుగా ప్రయాణం చేసే వారు గమనించవలసిందిగా తెలియజేశారు.

దోమలతో అప్రమత్తం

రామభద్రపురం: దోమల బారినపడకుంగా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని ఉపాధ్యాయుడు, రోటరీక్లబ్ జిల్లా చైర్మన్ జేసీ రాజు విద్యార్థులకు పిలుపునిచ్చారు. దోమల నివారణా దినం సందర్భంగా బుధవారం మండలంలోని నాయుడువలస గ్రామంలో ఇన్‌చార్జి హెచ్ఎం రెడ్డి వేణు దోమల నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి ఇంటిలో తప్పనిసరిగా దోమతెరలను వినియోగించి దోమల నుంచి రక్షణ కల్పించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు కృష్ణంనాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

లెప్రసీ రోగులకు మందులు పంపిణీ

గంట్యాడ: కుష్ఠు వ్యాధి లక్షణాలు ఉంటే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మహారాజా ఆసుపత్రికి చెందిన ఫిజియోథెరపిస్ట్ దినేష్ చెప్పారు. బుధవారం నరవ ఏఎంజీ కాలనీలో కుష్ఠు వ్యాధి లక్షణాలు ఉన్న వారికి ఉచితంగా ముందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రామలక్ష్మి, దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలకు స్మార్ట్ మీటర్లు

శృంగవరపుకోట: ప్రభుత్వ కార్యాలయాల్లో బుధవారం విద్యుత్ స్మార్ట్ మీటర్లను అమర్చినట్లు ఏపీ ఈపీడీసీఎల్ సహాయ ఇంజినీర్ ఆర్.రవి తెలిపారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు స్మార్ట్‌మీటర్లను కేటాయిస్తున్నామన్నారు. ఇప్పటికే పలు ప్రభుత్వ కార్యాలయాల్లో వీటిని బిగించామన్నారు.

ఇండియన్ పోలీసు మెడల్ గ్రహీతను అభినందించిన ఎస్పీ

విజయనగరం క్రైం: కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఇండియన్ పోలీసు మెడల్ గ్రహీత భోగా పురం ఏఎస్ఐ తిరుమలరాజు సూర్యనారాయణరాజును ఎస్పీ వకుల్ జిందాల్ జిల్లా పోలీసు కార్యాలయంలో అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం విజయవాడలో ఆగస్టు 15 న నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఇండియన్ పోలీసు మెడల్‌ను అందుకున్నారు. దీంతో సూర్యనారాయణరాజుకు ఎస్పీ శుభాకాంక్షలు తెలిపారు.

పాఠశాలలో టీకా కార్యక్రమం

బొబ్బిలి రూరల్: మండలంలోని బొడ్డవలస గ్రామం ఎంపీయూపీ పాఠశాలలో బుధవారం ఒకటో తరగతి విద్యార్థులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఏ ఎన్ఎం రాజేశ్వరి మాట్లాడుతూ టీకాలు సాధారణంగా బాల్యంలో తీవ్రమైన, తరచుగా వచ్చే ప్రాణాంతక వ్యాధు లనుండి రక్షించడానికి వేస్తారన్నారు. పిల్లలకు సమ యానుసారం టీకాలు వేయించాలన్నారు.

రహదారి భద్రతకు సహకరించాలి

● నిబంధనలు పాటించకుంటే ఆటోలను సీజ్ చేస్తాం

● ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైం, ఆగస్టు 21: జిల్లాలోని ఆటో డ్రైవర్లు రహదారి భద్రతకు సహకరించాలని ఎస్పీ వకుల్ జిందాల్ సూచించారు. బుధవారం మెసానిక్ టెంపుల్లో ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో రహదారి భద్రతా పట్ల ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్పీ వకుల్ జిందాల్ హాజరై మాట్లాడుతూ, రహదారి భద్రత అందరి బాధ్యతన్నారు. ఆటో డ్రైవర్ల నిర్లక్ష్యం కారణంగా ఎక్కువ రహదారి ప్రమాదాలు, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఆటోలకు రిజిస్ట్రేషన్ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్సు తప్పనిసరిగా ఉండాలని హెచ్చరించారు. ముఖ్య కూడళ్లల్లో ఆటోలను సక్రమంగా క్రమబద్ధంగా నిలుపుకోవాలన్నారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను అనుమ తించ వద్దని, యూనిఫాం ధరించాలని, నిబంధనలకు విరుద్ధంగా ఆటోల్లోకి స్కూల్ పిల్లలను అనుమతించవద్దన్నారు. నిబంధనలు పాటించకుంటే, ఆటోలను సీజ్ చేస్తామన్నారు. ట్రాఫిక్ సీఐ సూర్యనారాయణ మాట్లాడుతూ, ఆటో డ్రైవర్లు నిర్లక్ష్యంగా అస్తవ్యస్తంగా పార్కింగ్ చేయడంతో ఇబ్బందులు తలెత్తున్నాయన్నారు. రోడ్డు సేఫ్టీ ఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు మజ్జి అప్పారావు మాట్లాడుతూ, ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించి, రహదారి భద్రత పట్ల ఎస్పీ వకుల్ జిందాల్ అవగాహన కల్పించడం శుభ పరిణామమన్నారు. సీఐలు విజయానాథ్, శ్రీనివాస్, పి.శ్రీనివాసరావు, ఎస్ఐలు మహేశ్వరరాజు, రవి, నవీన్‌పడాల్, ఆటో డ్రైవర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ

ఎస్పీని కలిసిన సీఐలు

జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌ను బాధ్యతలు చేపట్టిన సీఐలు బుధవారం ఎస్పీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మహిళా పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టరుగా బాధ్యతలు చేపట్టిన నర్సింహమూర్తి, ఎస్‌బీ-2 ఇన్‌స్పెక్టరుగా బాధ్యతలు చేపట్టిన ఏవీ లీలారావు, రాజాం అర్బన్ పోలీసు స్టేషన్ సీఐగా బాధ్యతలు చేపట్టిన కె అశోక్ కుమార్, బొబ్బిలి సర్కిల్ ఇన్‌స్పెక్టరుగా బాధ్యతలు చేపట్టిన కె నారాయణరావు, బొబ్బిలి అర్బన్ ఇన్‌స్పెక్టరుగా బాధ్యతలు చేపట్టిన కె సతీష్‌కుమార్ మర్యాదపూర్వకంగా మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ, శాంతి భద్రతల సమస్యలు ఉత్పన్నం కాకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలని, విజిబుల్ పోలీసింగు విధిగా నిర్వహించాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలని దిశా నిర్దేశం చేశారు.

ఇసుక స్టాక్ పాయింట్ తనిఖీ చేసిన జేసీ

బొబ్బిలి, ఆగస్టు 21: స్థానిక ఏపీఐఐసీ గ్రోత్‌సెంటరులో గల ప్రభుత్వ ఇసుక స్టాకుపాయింట్‌ను బుధవారం రాత్రి జేసీ సేతు మాధవన్ తనిఖీ చేశారు. భారీ వర్షం కురుస్తున్నప్పటికీ ఆయన స్థానిక ఆర్డీవో కార్యాలయానికి సిబ్బందిని రప్పించారు. ఇసుక కోసం ఇతర జిల్లాలకు చెందిన భారీ వాహనాలు క్యూ కట్టి ఉండడంపై ఆరా తీశారు. రోజువారీ ఇసుక విక్రయవిధానానికి సంబంధించి ఎటువంటి పద్ధతులు పాటిస్తున్నారు.. ఏ ప్రాతిపదికన ఇసుకను పంపిణీ చేస్తున్నారని రెవెన్యూ, మైనింగ్, ఎస్ఈబీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. రికార్డుల్లో రాస్తున్న ఆధారనంబర్లు, ఇతర వివరాలు ఎంతమేరకు పారదర్శకంగా ఉన్నాయో పరిశీలించారు. తూనికయంత్రం లేకపోవడంతో వాల్యూమ్ అంచనా పద్ధతిలో ఇసుక పంపిణీ చేస్తున్నట్లు అధికారులు ఆయనకు వివరించారు. ఈ స్టాకు పాయింట్ నుంచి ఇసుక అక్రమంగా రవాణా అవుతున్నట్లు పెద్దఎత్తున ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో జేసీ తనిఖీకి ప్రాధాన్యం ఏర్పడింది. ఇతర జిల్లాలకు పంపిణీ చేస్తున్న ఇసుక వివరాలను సమగ్రంగా అందజేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఆర్డీవో ఆదిమూలం సాయిశ్రీ, తహసీల్దారు ఎం.శ్రీను, ఇరిగేషన్ డీఈఈ తిరుమల రావు, మైనింగ్ అధికారి, ఎస్ఈబీ ఎస్ఐ రామారావు, డీటీ సాయికృష్ణ, ఆర్ఐ కల్యాణచక్రవర్తి, ఎస్ఐ లోవరాజు తదితరులు పాల్గొన్నారు.



ఇసుక పంపిణీకి సంబంధించిన రికార్డులను పరిశీలిస్తున్న జేసీ సేతు మాధవన్

● ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇసుక స్టాక్ పాయింట్లను తనిఖీ చేశామన్నారు. జిల్లాలో ఇసుక పంపిణీకి సంబంధించి కలెక్టర్, ఎస్పీ సంయుక్తంగా సమావేశం నిర్వహించి పూర్తి వివరాలను వెల్లడిస్తారని, ఇసుక పంపిణీ తీరు, విధి విధానాలపై వివరిస్తారన్నారు.

వీఆర్ఏల సమస్యల పరిష్కారానికి సహకరించండి

లక్కవరపుకోట/వేపాడ: చాలీచాలని వేతనాలతో దుర్భరమైన జీవితాలను వెళ్లదీస్తున్న గ్రామ రెవెన్యూ అసిస్టెంట్ల సమస్యల పరిష్కారానికి సహకరించాలని కోరుతూ శృంగ వరపుకోట నియోజకవర్గ పరిధిలోని వీఆర్యేలు ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారికి వినతిపత్రం అందజేశారు. బుధవారం లక్కవరపుకోట మండల కేంద్రంలో గల ఎమ్మెల్యే స్వగృహంలో లలితకుమారిని వీఆర్యేల సంఘ నాయకులు కలిశారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో సుమారు 100 మంది గ్రామ రెవెన్యూ అసిస్టెంట్లు పని చేస్తున్నారని జిల్లా వీఆర్యేల సంఘం ప్రధాన కార్యదర్శి గట్టు వెంకన్న ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. అర్హులైన వీఆర్యేలను ఖాళీగా ఉన్న వీఆర్వోలు పోస్టు, అటెండర్, వాచ్‌మేన్, రికార్డు అసిస్టెంటు పోస్టుల్లో నియమించడం ద్వారా ప్రమోషన్లు కల్పించి న్యాయం చేయాలని మొరపెట్టుకున్నారు. కార్యక్రమంలో ఐదు మండలాలు జామి, కొత్తవలస, లక్కవరపుకోట, శృంగవరపుకోట, వేపాడ మండలాల వీఆర్యేలు, వీఆర్యేల సంఘ నాయకులు పాల్గొన్నారు.



లలితకుమారికి వినతిపత్రం అందజేస్తున్న వీఆర్ఏల సంఘ నాయకులు

ఎస్సీ వర్గీకరణను తక్షణమే అమలు చేయాలి

విజయనగరం రింగురోడ్డు, ఆగస్టు 21: దేశ అత్యున్నత న్యాయ స్థానం ఈ నెల 1న ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చిన నేపథ్యంలో 29 రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే విద్య, ఉపాధి, రాజకీయ రంగాల్లో అమలు చేయాలని ఎంఈఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు అరసాడ రవి కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం కంటోన్మెంట్‌లోని సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇన్నేళ్ళకు సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణకు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో నేడు సీఎంగా చంద్రబాబు నాయుడు ఉం డడం మాదిగలు అదృష్టంగా భావిస్తున్నామన్నారు. పెంకి ఇజ్రాయిల్, మాదిక ఉద్యోగుల సమాఖ్య పోరాట సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రవికుమార్

5 నుంచి సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధం

విజయనగరం రింగురోడ్డు, ఆగస్టు 21: నగరంలో వచ్చే నెల 5 నుంచి సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధాన్ని అమల్లోకి తీసుకురానున్నా మని నగరపాలక సంస్థ కమిషనర్ నాయుడు అన్నారు. బుధవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్లాస్టిక్ విక్రయదారు లతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్లాస్టి క్ డిస్ట్రిబ్యూటర్స్, హోల్‌సేల్స్, రిటైల్ వర్తకు లతో సమావేశమై, నగరంలో తక్షణం సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధానికి నిర్ణయించడ మైనదన్నారు. అయితే ఇప్పటికే తన వద్ద ఉన్న ప్లాస్టిక్ వస్తువులు అమ్మకాలు అయినంత వరకూ కొంత సమయం కావాలని వర్తకులు కోరారని, ఇందుకోసం 15 రోజులు గడువు విధిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు.

మంచి మనసుతోనే సేవా కార్యక్రమాలు

కొత్తవలస: సేవాకార్యక్రమాలు నిర్వహించాలంటే మంచి మనసు ఉండాలని శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్లలలిత కుమారి అన్నారు. బుధవారం మండలంలోని మంగళపాలెం గ్రామంలో చేతన్ ఫౌండేషన్ ఆర్థిక సాయంతో గురుదేవ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎవ్వరికైనా గురుదేవ ట్రస్టు ద్వారా తమ సేవలు అందించే వీలుంటుందన్నారు. ఈ సందర్భంగా కోలాటంను ప్రోత్సహించడం కోసం మహిళలకు కోలాటం కర్రలు, చీరలు, భజనలు నేర్చుకునేవారికి భజన తాళాలు, చిరువ్యాపారాలు చేసుకునేందుకు రెండు కిరణాషాపులను అందించారు. ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్ బాబుతో పాటు తెలుగు దేశం పార్టీ నాయకులు కోళ్ల వెంకటరమణ, పిల్లా అప్పలరాజు, కోరుబిల్లి ఉపేంద్ర, పి.జగ్గారావు, పాల్గొన్నారు.

గుడ్ టచ్-బ్యాడ్ టచ్‌పై అవగాహన

బొబ్బిలి రూరల్: మండలంలోని పిరిడి గ్రామంలో బుధవారం స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళా పోలీసు అమ్మడమ్మ ఆధ్వర్యంలో 8, 9, 10 తరగతి బాలికలకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ చదువు పట్ల ఇష్టం పెంచుకోవాలని, సమస్యలు ఉంటే ఉపాధ్యాయులకు తెలియజేయాలన్నారు. ఐసీడీఎస్ ప్రోజెక్ట్ సూపర్‌వైజర్ ఎన్ ప్రభావతి వ్యక్తిగత శుభ్రత, రక్తహీనతపై జాగ్రత్తలపై వివరించారు.

డీఎస్పీని కలిసిన బొబ్బిలి సీఐలు

బొబ్బిలి, ఆగస్టు 21: బొబ్బిలి అర్బన్, రూరల్ సీఐలుగా కటకం సతీష్ కుమార్, నారాయణరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం డీఎస్పీ శ్రీనివాసరావును కలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ వారికి అనేక సూచనలిచ్చారు. గంజాయిని అరికట్టడమే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని, చెక్ పోస్టులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు.

పార్టీకి ప్రచారం చేసిన వారికి గుర్తింపు

● సర్టిఫికెట్లు అందించిన అదితి

విజయనగరం రూరల్, ఆగస్టు 21: గత ఐదేళ్ల వైసీపీ అవినీతి, ప్రజా వ్యతిరేక పాలనపై టీడీపీ యాప్ ద్వారా పార్టీ శ్రేణులను, ప్రజలను చైతన్యవంతులు చేయడంలో ప్రతిభ కనబరిచిన విజయనగరం నియోజకవర్గ టీడీపీ నాయకులు, కార్యకర్తలకు రాష్ట్ర పార్టీ పంపిన ప్రత్యేక సర్టిఫికెట్‌లను విజయనగరం నియోజకవర్గ ఎమ్మెల్యే అదితి గజపతిరాజు బుధవారం పార్టీ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తాజాగా ఎన్‌డీఏ ప్రభుత్వం చేపడుతున్న వివిధ ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి ఈ యాప్ ద్వారా తీసుకువెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ప్రసాదుల ప్రసాద్, ఆల్తి బంగారుబాబు, మైలిపల్లి పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ నాయకులకు సర్టిఫికెట్లు బహూకరిస్తున్న ఎమ్మెల్యే అదితి

మహిళలపై నేరాలు అరికడతాం

● ఎస్‌డీపీవో అంకిత సురానా

పార్వతీపురం, ఆగస్టు21(ఆంధ్రజ్యోతి)/బెలగాం/పార్వతీపురం టౌన్ : మహిళలపై జరుగుతున్న నేరాలను అరికడతామని పార్వతీపురం ఎస్‌డీపీవో అంకిత సురానా తెలిపారు. బుధవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. విశాఖపట్నం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చిన ఎస్‌డీపీవో తొలుత కలెక్టరేట్‌లో కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం పట్టణ పోలీసు స్టేషన్‌ను సందర్శించి ఎస్ఐలు, సిబ్బందితో సమావేశమయ్యారు. శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని, మహిళా రక్షణ, డ్రగ్స్ నియంత్రణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఒడిశా నుంచి గంజాయి, నాటు సారా వంటివి అక్రమ రవాణా జరగకుండా చూడాలన్నారు. మాదక ద్రవ్యాలకు యువత బానిసలు కాకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. సైబర్ నేరాలపై ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

రామభద్రపురం: సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి భాస్కరరావు సూచించారు. మండల పరిధిలోని ఆరికతోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ ఆయా సబ్ సెంటర్ల పరిధిలోని గ్రామాలకు వెళ్లి అంటు రోగాలు, జ్వరాలపై ఆరా తీయాలని సూచించారు. అపారిశుధ్యాన్ని నిర్మూలించడంలో గ్రామ పంచాయతీలు భాగస్వామ్యం కావాలన్నారు. ఆసుపత్రిలో ప్రసవాలపై ఆరా తీశారు. ఆసుపత్రి పరిసరాలను శుభ్రంగా ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలని, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడానికి సిబ్బంది తమవంతు కృషి చేయాలని సూచించారు. ఆసుపత్రి వైద్యాధికారి దీపక్, ఈవో మల్లికేశ్వరరావు, ఫార్మసిస్టు పొట్టా కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మాక్ గ్రామసభలు

రామభద్రపురం: మండల పరిధిలోని బూసాయవలస గ్రామంలో బుధవారం మాక్ గ్రామసభను నిర్వహించారు. ఎంపీడీవో రమామణి ఆధ్వర్యంలో వివిధ అంశాలపై ఉపాధిహామీ పథకం వేతనదారులకు, ప్రజలకు అవగాహన కల్పించారు.


రాజాం: పెనుబాక గ్రామంలో ఈనెల 23న జరగనున్న ఉపాధి హామీ పథకం గ్రామసభ నేపథ్యంలో బుధవారం మాక్ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామంలో ఏ ఏ పనులు చేపట్టాలో ముందుగా తెలియజేయాలన్నారు. ఈ ఏడాది 100 రోజుల పనులు చేపట్టడానికి ప్రభుత్వం నిర్ణయించిందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో సాయిరాం తదితరులు పాల్గొన్నారు. ● **బొబ్బిలి రూరల్:** బొబ్బిలి మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీడీవో రవికుమార్ అధ్యక్షతన అన్ని మండలాల పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రవికుమార్ ఈ నెల 23న జరగబోవు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ గ్రామ సభలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. ● **బాడంగి:** ఉపాధిగ్రామసభపై అందరూ అవగాహన కల్పించుకోవాలని ఎంపీడీవో ఆంజనేయులు కోరారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇతర అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామసభ ఆవశ్యకతను ప్రజలకు వివరించాలన్నారు. గ్రామసభలో వివరించాల్సిన విషయాలను, వాటికి సంబంధించి పూర్తి సమాచారంను సిద్ధం చేసుకోవాలన్నారు.

పాలకొండ డీఎస్పీ బదిలీ

పాలకొండ: పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణారావుకు బదిలీ అయింది. ఈ మేరకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఆయన్ని అమరావతి పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌కు పంపిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. అయితే ఆయన స్థానంలో పాలకొండ డీఎస్పీగా ఇంకా ఎవర్నీ నియమించలేదు.

ఎక్స్‌కవేటర్ తగిలి వ్యక్తి మృతి

భోగాపురం, ఆగస్టు 21: ఎక్స్‌కవేటర్ తగిలి వ్యక్తి మృతి చెందన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి సీఐ ఎన్వీ ప్రభాకరరావు బుధవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలం తూడెం పంచాయతీ గాలిపేటకు చెందిన బోరబంగారి(54)కి ఇద్దరు కుమారులు. పెద్దకుమారుడు బోర అప్పలనర్శయ్యకు జేసీబీ ఉంది. దీనిని అద్దెకు తిప్పుతూ కుటుంబం జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో బసవపాలెం గ్రామంలో రీసు అప్పారావు ఇంటిని కూల్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. అనంతరం జేసీబీతో పనులు నిర్వహిస్తుండగా మంగళవారం సాయంత్రం పగిలిన స్లాబ్‌కి ఉన్న ఇనుప ఊచలను తండ్రి బోరబంగారి వేరుచేస్తున్నాడు. అదే సమయంలో గోడ పగలుకొడుతున్న జేసీబీ బలంగా బంగారికి తగలడంతో తలకు బలమైన గాయమైంది. దీంతో వెంటనే చికిత్స నిమిత్తం విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య తోటమ్మ ఉంది. దీనిపై మృతుడు రెండో కుమారుడు బోర సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



బోరబంగారి (ఫైల్)

విద్యుదాఘాతంతో ఒకరు..

గజపతినగరం, ఆగస్టు 21: విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి ఎస్సై లక్ష్మణరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కెంగువ గ్రామానికి చెందిన యిజ్జిరోతు రామునాయుడు(45) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం పొలంలో నీరు తడి పెట్టేందుకు బోరు వద్దకు వెళ్లి మోటారు ఆన్ చేయగా షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడికి భార్య గౌరి, పిల్లలు లక్ష్మి, భాస్కరరావు ఉన్నారు. ఇంటి యజమాని మృతిచెందడంతో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. భార్య గౌరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. శవపంచనామ నిమిత్తం మృతదేహాన్ని జిల్లా కేంద్రానికి తరలించారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తులు అరెస్టు

విజయనగరం క్రైం, ఆగస్టు 21: విజయనగరం వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని సీఎంఆర్ జంక్షన్ సమీపంలో ఇద్దరు వ్యక్తులు అక్రమంగా గంజాయి విక్రయిస్తున్నట్టు వన్‌టౌన్ పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో సీఐ శ్రీనివాస్, సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని గాజులరేగకు చెందిన డి జ్యోతిరామ్, ఒడిసా రాష్ట్రం రాయగడకు చెందిన సునబూడి అనురాధను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి నాలుగు కిలోల గంజాయి, పొగాకు కలిపిన మెటీరియల్‌ను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ శ్రీనివాస్ తెలిపారు. జ్యోతిరామ్‌పై 25 కేసులు ఉన్నాయని, ఒడిసాకు చెందిన అనురాధ వద్ద గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి చిన్న, చి న్న పొట్లాలు కట్టి విజయనగరం పరిసర ప్రాంతాల్లో అమ్ముతున్నట్టు విచారణలో తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్టు సీఐ తెలిపారు.



నిందితులతో సీఐ శ్రీనివాస్

శ్రీరాంపురంలో భారీ చోరీ

● 20 తులాల బంగారం, నగదు అపహరణ

లక్కవరపుకోట, ఆగస్టు 21: ఓ ఇంట్లో చోరీ జరిగి బంగారం, నగదు అపహరించుకుపోయిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి ఎస్ఐ ఆర్.గోపాలరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని శ్రీరాంపురంలో నివాసం ఉంటున్న భూమిరెడ్డి ఎర్నాయుడు ఎప్పటిలా తన కుటుంబం సభ్యులతో కలిసి బుధవారం ఉదయం ఇంటి నుంచి బయలుదేరి సుమారు 10-30 సమయంలో పొలానికి వెళ్లారు. భార్య దేవి పొలం పనులు ముగించుకుని మధ్యాహ్నం 12-30 సమయానికి ఇంటికి వచ్చి తలుపు తీయగా ఇంటిలో ఉన్న కిటికీలు, తలుపులు, బీరువా తెరిచి ఉన్నాయని గమనించారు. వెళ్లి చూడగా వరలక్ష్మి వ్రతానికి తెచ్చుకున్న 20 తులాల బంగారు ఆభరణాలు, 20 వేల నగదు చోరీకి గురైనట్టు గుర్తించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సీఐ రవికుమార్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నారు. విజయనగరం క్లూస్ టీం సీఐ మురళీ, సిబ్బంది వేలిముద్రలు సేకరించారు. ఘటనపై కే సు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ గోపాలరావు తెలిపారు.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

విజయనగరంలో నాలుగు చోట్ల..

విజయనగరం క్రైం: నగరంలోని తోటపాలెం వైఎస్సార్ నగర్‌లో మంగళవారం రాత్రి నాలుగిళ్లల్లో దొంగతనం జరిగినట్టు సీఐ ఎస్ శ్రీనివాస్ తెలిపారు. నాలుగిళ్లల్లో కలిసి మూడు తులాలు బంగారు ఆభరనాలు, వెండి వస్తువులతో పాటు 1 లక్ష 40 వేలు నగదు దొంగతనం అయినట్టు తెలిపారు. సంఘటన స్థలా న్ని క్లూస్ టీంతో కలిసి పరిశీలించామని త్వరలో దొంగతనాలకు పాల్పడిన నిందితులను అదుపులోకి తీసుకుంటామని సీఐ తెలిపారు.

మద్యం సీసాల ధ్వంసం

శృంగవరపుకోట: శృంగవరపుకోట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల పట్టుబడ్డ 633 మద్యం సీసాలను బుధవారం ధ్వంసం చేశారు. ఈ స్టేషన్ పరిధిలో 43 కేసుల్లో వీటిని స్వాధీనపరుచుకున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంటు సహాయ సూపరింటెండెంట్ డీవీజీ రాజు పాల్గొన్నారు.

కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

● దీర్ఘకాలిక సమస్య పరిష్కరించిన విద్యుత్‌శాఖ ఏఈ

శృంగవరపుకోట రూరల్: మండలంలోని ముషిడిపల్లి పంచాయతీలోని గురుకుల పాఠశాల, కళాశాలలకు దీర్ఘకాలికంగా వేధిస్తున్న దీర్ఘకాలిక విద్యుత్‌సమస్యకు మండల విద్యుత్‌శాఖ ఏఈ రుద్రరవికుమార్ పూర్తిస్థాయిలో పరిష్కరించారు. రెండురోజుల క్రితం ఈ పాఠశాల, కళాశాలలకు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్ పాడవడంతో ఇందులో ఉన్న వందలాదిమంది విద్యార్థులకు భోజనాలు ఆలస్యంగా పెట్టడంతో పాటు వారు చదువుకోవడానికి ఇబ్బంది పడ్డారు. దీంతో మంగళవారం రాత్రి పదకొండు గంటల సమయంలో మండలంలో ఉన్న విద్యుత్‌శాఖ సిబ్బందిని తీసుకెళ్లి కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి హుటాహుటిన కొత్తట్రాన్స్‌ఫార్మర్ తెప్పించి అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్స్ సహకారంతో ఈప్రాంతంలో ఉన్న తుప్పలు, డొంకలు, విద్యుత్‌వైర్లకు అనుకుని ఉన్న చెట్లు తీయించారు. దీంతో ఈ సమస్యకు చెక్‌పడినట్లయింది.

నిమ్మలపాడులో 3,4,5 తరగతులు పునరుద్ధరించాలి

బొబ్బిలి రూరల్: మండలంలోని గిరిజన గ్రామమైన చిత్రకోటబొడ్డవలస పంచాయతీ, నిమ్మలపాడు ప్రభుత్వ పాఠశాలలో 3, 4, 5 తరగతులను పునరుద్ధరించాలని గ్రామస్థులు ఇచ్చిన వినతి పత్రాన్ని యూటీఎఫ్ రాష్ట్ర మహిళా సభ్యురాలు విజయగౌరి, మండల విద్యాశాఖాధికారికి బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఈ మధ్యనే ఆ గ్రామాన్ని సందర్శించానని, ఆ గ్రామంలో 1, 2 తరగతులు మాత్రమే ఉన్నాయనీ, 3, 4, 5 తరగతులు లేకపోవడం వలన సాలూరు మండలం తాడిలోవ గ్రామానికి చిన్నపిల్లలు నడుచుకుంటూ 3 కి.మీ దూరం వెళ్లవలసి వస్తుందనీ, దీనితో పిల్లలకు రక్షణ లేకుండా పోతుందనీ, తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారని తెలిపారు. దీనిపై మండల విద్యాశాఖాధికారి చల్ల లక్ష్మణరావు సానుకూలంగా స్పందించి ఈ సమస్యను జిల్లా విద్యాశాఖాధికారి దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

సైబర్ నేరాలపై అవగాహన కల్పించండి

కొత్తవలస: గ్రామ సచివాలయాలలో పనిచేస్తున్న మహిళా పోలీసులు సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని కొత్తవలస సీఐ షణ్ముకరావు సూచించారు. బుధవారం కొత్తవలస పోలీసు స్టేషన్‌లో మండల సచివాలయాల పోలీసులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో చాలామందికి సైబర్ మోసాలపై సరైన అవగాహన లేక తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. సైబర్ నేరగాళ్లంతా వివిధ రకాలుగా మోసాలు చేయడానికి ప్రయత్నాలు చేస్తుంటారని, వాటి గురించి గ్రామీణ ప్రాంత ప్రజలకు తెలియజేసి జాగ్రత్త పరచాలన్నారు.

కట్టెలతో వంటచేస్తే చర్యలు

మెంటాడ: పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు గ్యాస్ తోనే వంట చేయాలని ఎంఈఓ వర్మ స్పష్టం చేశారు. ఈ నెల 18న 'కట్టెలకో దండం..వంట చేయలేం' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన వార్తకు డీఈఓ ప్రేమ్ కుమార్ స్పందించారు. పూర్తి వివరాలు అందజేయాలని ఎంఈఓను ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఆయన అందరు హెడ్మాస్టర్లకు ఉత్తర్వులు జారీ చేశారు. గ్యాస్ కాకుండా కట్టెలు వినియోగిస్తే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇలా ఉండగా.. ఎంఈఓ సూచనల మేరకు ఫీల్డ్ విజిట్‌కు వెళ్లిన స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్లకు వింత పరిస్థితి ఎదురవుతోంది. మెనూ ప్రకారం నిత్యం మూడు రకాల వంటలు ఒక్క సిలిండర్‌తో చేయడంతో రెండు మూడు రోజులకే అయిపోతుందని, తిరిగి గ్యాస్ సరఫరా అయ్యేవరకు కట్టెలే దిక్కువుతున్నాయని వారు కుండబద్దలు కొట్టినట్లు చెప్పారు. చైర్మన్లు ఇదే విషయాన్ని ఎంఈఓకు స్పష్టం చేస్తున్నారు. దీనిపై డీఈఓకు నివేదిక అందజేస్తామని చెప్పారు.

వసతిగృహాల్లో ఆకస్మిక తనిఖీలు

బొబ్బిలి: బొబ్బిలి పట్టణంలో స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వసతిగృహాలను జిల్లా ఐసీడీఎస్ పీడీ బి.శాంతకుమారి ఆధ్వర్యంలోని అధికారుల బృందం బుధవారం సాయంత్రం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అనకాపల్లిలో కలుషిత ఆహారం కారణంగా చిన్నారులు మృతిచెందడం, పలువురి తీవ్ర అస్వస్థతకు గురైన నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాలమేరకు ఈ తనిఖీలు చేపట్టారు. తొలుత హేండ్ ఇన్‌హేండ్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలలఅనాథాశ్రమాన్ని తనిఖీ చేశారు. అక్కడ అంతాసక్రమంగా ఉండడంతో అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు. బయటవారు వండి పంపించిన ఆహారపదార్థాలను ఎట్టిపరిస్థితుల్లో పిల్లలకు పెట్టరాదని నిర్వాహకులకు తెలిపారు.న పాతబొబ్బిలిలో గల ప్రభుత్వ బాలసదన్‌ను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడారు, భోజన నాణ్యత, ఇతర సౌకర్యాలపై ఆరా తీశారు. ● స్థానిక ఐరిస్ స్కూలుకు చెందిన వసతిగృహాన్ని తనిఖీ చేశారు. రిజిస్ట్రేషన్ లేకుండా హాస్టల్ నిర్వహించరాదన్నారు. విద్యార్థులతో మాట్లాడి సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. పీడీ వెంటే స్థానిక ఐసీడీఎస్ పీవో జె.విజయలక్ష్మి, సూపర్‌వైజర్ అరుణ, నిర్మల, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. ● **తెర్లాం:** మండలంలోని గంగన్నపాడు ఎంపీపీ పాఠశాలను ఎంఈవో త్రినాథరావు బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలను, మరుగుదొడ్లు, రన్నింగ్ వాటర్, తాగునీటి సదుపాయా న్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థుల నైపుణ్యాలను పరిశీలించారు. అలాగే సిలబస్ పూర్తి, వర్క్ బుక్ కరెక్షన్, పాఠశాల రికార్డులను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన పథక నిర్వహణను తనిఖీ చేసి ని ర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఉపాధ్యాయులు ఉన్నారు.

జామి: మండలంలో ఉన్న ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో ఉన్న సౌకర్యాలపై నివేదికలు పంపాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించండంతో మండలంలోని భీమసింగి బాలాజీ జూనియర్ కళాశాలతో పాటు పలు పాఠశాలలు, అంగన్వాడీకేంద్రాలను తహసీల్దార్ కృష్ణలత బుధవారం పరిశీలించారు. వసతి, ఆహారం వంటివి తనిఖీ చేశారు. కుల ధ్రువీకరణ పత్రాలకు చేసుకున్న దరఖాస్తులు తిరస్కరణకు గురవడంతో సంబంధిత కుటుంబాల వద్దకు వెళ్లి తిరస్కరణకు గల కారణాలను పరిశీలించి, వీటిపై నివేదికను కలెక్టర్‌కు అందిస్తామని తెలిపారు.



ఎస్‌కోట రూరల్: భీమసింగిలోని ఓ కళాశాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ కృష్ణలత

నాణ్యమైన సరుకులు పంపిణీ చేయండి

● ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో రమణ



సీతంపేట: జన్‌మాన్ ద్వారా అందుతున్న సేవలను ఆరా తీస్తున్న రమణ

సీతంపేట:నాణ్యమైన సరుకులు పంపిణీ చేయాలని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో వీవీ రమణ కోరారు. బుధవారం ఐటీడీఏ పరిధిలోని 12 గురుకుల పాఠశాలలకు కూరగాయలు, పండ్లు సరఫరాకు టెండర్లు నిర్వహించారు. ఇటీవల కూరగాయలు, పండ్లు సరఫరాలో టెండర్‌దారులు తక్కువ ధరకు టెండర్ కోడ్ చేయడంతో అప్పటి పీవో రాహల్‌కుమార్‌రెడ్డి రద్దు చేసిన విషయం విదితమే. తాజాగా ఇన్‌చార్జి పీవో ఆధ్వర్యంలో ఎస్ఆర్ శంకరన్న సమావేశ మందిరంలో టెండర్లు నిర్వహించారు. టెండర్లలో ఫైనల్ అయిన ధరకే సరఫరా చేయాలని కోరారు. నాణ్యమైన కూరగాయలు సరఫరా చేయని పక్షంలో టెండర్లు రద్దు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీవో చినబాబు, డీడీ అన్నదొర, డిప్యూటీ డీఈవో నారాయుడు, జీసీసీ మేనేజర్ దాసరి కృష్ణ పాల్గొన్నారు.

'పీఎం జన్‌మాన్' అందరికీ అందాలి

పీఎం జన్‌మాన్ ద్వారా వచ్చే పథకాల లబ్ధి అందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో వీవీ రమణ కోరారు.బుధవారం మండలంలోని దిబ్బగూడలో పీఎం జన్‌మాన్ పథకం ద్వారా గిరిజనులకు అందుతున్న సేవల వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏపీవో చినబాబు, ఈఈ సింహాచలం, డీఈ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల సిబ్బందికి అభినందన

సీతంపేట గిరిజనబాలికల గురుకుల రెసి డెన్షియల్ పాఠశాలకు రాష్ట్రస్థాయిలో ఉత్తమ పాఠశాలగా ఎంపిక కావడంతో ఐటీడీఏ పీవో అభినందించారు.ఈ మేరకు ఇటీవల స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని సీఎం చంద్రబాబు చేతుల మీదుగా అవార్డు అందుకున్న విషయం విదితమే. ఈ మేరకు ఐటీడీఏ పీవో రమణ బుధవారం పాఠశాల సిబ్బందిని అభినందించారు. కార్య క్రమంలో డీడీ అన్నదొర, ప్రిన్సిపాల్ విజయకుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాల తనిఖీ

సీతంపేట రూరల్: గిరిజన విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సీతంపేట ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో వీవీ రమణ ఆదేశించారు.బుధవారం మండలంలోని చిన్నబగ్గ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలను పీవో ఆకస్మిక తనిఖీ చేపట్టారు.ఆయన వెంట ఏపీవో చినబాబు,టిడబ్ల్యు ఈఈ సింహాచలం ఉన్నారు.

ఏకలవ్య పాఠశాల పనులు పూర్తి చేయాలి

భామిని: పెండింగ్‌లో ఉన్న ఏకలవ్య పాఠశాల పనులు ఈ నెల 31లోగా పూర్తి చేయాలని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో వీవీ రమణ ఆదేశించారు. బుధవారం పాఠశాలను సందర్శించి పెండింగ్‌లో ఉన్న పనులపై అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు ఈఈ సింహాచలం, ఇతర సిబ్బంది ఉన్నారు.

వ్యవసాయాన్ని అనుసంధానం చేయాలి

● ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పలనాయుడు



మాట్లాడుతున్న బుడితి అప్పలనాయుడు

పాలకొండ: ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అను సంధానం చేస్తూ పంచాయతీలు శుక్రవారం జరిగే గ్రామ సభల్లో తీర్మానించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు కోరారు.బుధవారం మండలంలోని కొండాపురంలో విలేకరులతో మాట్లాడుతూ రైతుల పక్షాన నిలబడి వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవడానికి తప్పనిసరిగా గ్రామసభలో తీర్మానం ఆమోదించాలని కోరారు.సమావేశంలో రైతు సంఘం నాయకులు కిమిడి రామ్మూర్తినాయుడు, జి.అప్పలనాయుడు, కిమిడి రామ్మూర్తినాయుడు, బొత్స గౌరునాయుడు, వండాన కూర్మారావు, దుర్గారావు, అంపోలు చిన్నంనాయుడు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి

జియ్యమ్మవలస:ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని గృహ నిర్మాణశాఖ ఏఈ ఎల్.ఉమామహేశ్వరరావు ఒక ప్రకటనలో కోరారు. మండలంలో ప్రధాన మంత్రి అవాస్ యోజన (పీఎంఏవై) గ్రామీణ్‌లో 1,839 ఇళ్లు మంజూరు కాగా, 450 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభం కాలేదని, 594 ఇళ్లు బీబీఎల్ స్టేజ్‌లో, 274 ఇళ్లు బేస్‌మెంట్ లెవెల్‌లో, 224 ఇళ్లు రూఫ్ లెవెల్‌లో, 55 ఇళ్లు రఫ్ కంప్లీటెడ్‌లో, 242 ఇళ్లు నిర్మాణాలు పూర్తయ్యాయని తెలిపారు. పీఎంఏవై అర్బన్‌లో 298 ఇళ్లు మంజూరు కాగా, 39 ఇళ్లు మాత్రమే నిర్మాణాలు పూర్తయ్యాయని, 450 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభం కాలేదని, మిగిలిన ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయని పేర్కొన్నారు. ఇక నుంచి ప్రభుత్వం ఇళ్లను నిర్మిస్తే బిల్లుల వేయడానికి సిద్ధంగా ఉందని తెలిపారు. ఇప్పటికే కొంతమంది లబ్ధిదారులకు బిల్లులు వారి అకౌంట్లలో జమవుతున్నాయని తెలిపారు. ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని, లేకపోతే ఇళ్లు రద్దవుతాయని పేర్కొన్నారు.

నాణ్యమైన సరుకులు దిగుమతి చేసుకోండి

● పార్వతీపురం జీసీసీ డివిజనల్ మేనేజర్ మహేంద్రకుమార్

గుమ్మలక్ష్మీపురం: జీసీసీ గోదాములకు ముందు వచ్చిన సరుకులను డీఆర్ డిపోలు, గిరిజన సంక్షేమ వసతిగృహాలకు పంపివేయాలని, నాణ్యమైన సరుకులనే గోదాముల్లో దిగుమతి చేసుకోవాలని పార్వతీపురం గిరిజన సహకార సంస్థ డివిజనల్ మేనేజర్ యు.మహేంద్రకుమార్ తెలిపారు. బుధవారం గుమ్మలక్ష్మీపురం జీసీసీ గోదామును పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజన సహకార సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న గోదాముల్లో నాణ్యమైన నిత్యావసర సరుకులను మాత్రమే ఉంచాలని తెలిపారు.ఆయన వెంట జీసీసీ మేనేజర్ కృష్ణ ప్రసాదరావు, గోదాము సూపరింటెండెంట్ సాంబశివరావు ఉన్నారు.

25లోగా మిల్లు యజమానులు దరఖాస్తు చేసుకోవాలి

పార్వతీపురం ఆంధ్రజ్యోతి: జిల్లాలో కొత్తగా ధాన్యం మిల్లులు నిర్మించుకున్న మిల్లుల్లో యజమానులు ఖరీఫ్ సీజన్ సమీపిస్తుండడంతో సీఎంఆర్‌లో పాల్గొనేందుకు ఆసక్తి ఉంటే అనుమతి కోసం ఈ నెల 25లోగా దరఖాస్తులు చేసుకోవాలని జేసీ శోభిక ఒక ప్రకటనలో తెలిపారు. దీనికోసం రిజిస్ట్రేషన్ తదితర ప్రక్రియను పూర్తి చేసుకోవాలని కోరారు.

రాయగడలో బంద్ ప్రశాంతం



బంద్ నిర్వహిస్తున్న యువకులు

ఒడిశా

రాయగడ: రాయగడలో బంద్ బుధవారం ప్రశాంతం జరిగింది. ఈ నెల ఒకటో తేదీన సుప్రీంకోర్టు ఎస్సీ, ఎస్టీ తెగల రిజర్వేషన్లపై ఇచ్చిన తీర్పుకు నిరసనగా ఆయా తెగల సభ్యుల పిలుపు మేరకు భారత బంద్ నిర్వహించారు.ఈసందర్భంగా ఉదయం ఆరు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటుచేశారు. పట్టణంలో దుకాణాలు, పాఠశాలలు కళాశాలలు మూసివేశారు. బస్సులు నిలిపి వేయడంతో ప్రయాణికులు ఇబ్బందిపడ్డారు.

సత్యరామాయణం పుస్తకావిష్కరణ

రాయగడ:రాయగడలోని బాలాజీ వేంకటేశ్వరాలయంలో విశాఖకు చెందిన ప్రముఖ రచయిత్రి పి.సత్యవతి రచించిన సత్యరామాయణం పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా రామాయణం పారాయణ కార్యక్రమం నిర్వహించారు.ముగింపు పురస్కరించుకుని బుధవారం ఆమెను బ్రాహ్మణ సమాజం సభ్యులు, ఆలయట్రస్టు అధ్యక్షులు సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టు అధ్యక్షుడు కొత్తకోట రాఘవ కుముందాన్, ఉత్కళాంధ్ర బ్రాహ్మణ సమాజం అధ్యక్షుడు రేజేటి శ్రీనివాస శర్మ, కార్యదర్శి భళ్లమూడి నాగరాజు, ఆలయ ప్రధానార్చకులు భాస్కరాచార్యులు పాల్గొన్నారు.

పని చేయకపోతే వెళ్లిపోండి

● సమావేశాలకు డుమ్మా కొడతామంటే క్షమించేది లేదు ● పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయకృష్ణ

సీతంపేట రూరల్: గిరిజన ప్రాంతాల్లో గిరిజనుల అభివృద్ధి కోసం నిరంతరం పనిచేస్తామంటేనే ఇక్కడ ఉండాలని, లేకుంటే బదిలీపై వెళ్లిపోవాలని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ తెలిపారు. బుధవారం సీతంపేట వైటీసీలో ఎంపీపీ బిడ్డిక ఆదినారాయణ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జయకృష్ణ మాట్లాడుతూ సమావేశానికి అధికారులు డుమ్మా కొడతామంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. మలేరియా జ్వరాలు విస్తరిస్తున్న నేపథ్యంలో వైద్యాధికారులు పూర్తి సమాచారంతో ఎందుకు సమావేశానికి హాజరు కాలేదని ప్రశ్నించారు. సమావేశానికి హాజరు కాని అధికారులకు మెమోలు జారీ చేయాలని ఎంపీడీవో గీతాంజలిని ఎమ్మెల్యేఆదేశించారు. గిరిజన ప్రాంతం అభివృద్ధి కోసం ప్రజాప్రతినిధులతో పాటు అధికారులు కూడ భాగస్వామ్యం కావాలని కోరారు. ప్రతి పంచాయతీ పరిధిలో 100 పనులు గుర్తించాలని సూచించారు.గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ శాఖ ద్వారా చేపడుతున్న రహదారి పనుల్లో నాణ్యత పాటించి సకాలంలో పూర్తిచేయాలని ఇంజినీరింగ్ ఏఈ నాగభూషణరావుకు సూచించారు.సమావేశాలకు వస్తేనే గ్రామాల్లో సమస్యలు పరిష్కారమవుతాయని తెలిపారు.అనంతరం శాఖలవారీగా పలు సమస్యలపై చర్చజరిగింది. సమావేశంలో జడ్పీటీసీ సవరలక్ష్మి, కోఆప్షన్ సభ్యులు సవరలక్ష్మి, ఈవోపీఆర్డీ సత్యం,పలు శాఖ అధికారులు పాల్గొన్నారు.

నిందితులను శిక్షించండి

● జూనియర్ వైద్యురాలి హత్యపై నిరసనలు

కోల్‌కత్తాలో జూనియర్ వైద్యురాలిపై అత్యాచారం, హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని వివిధ సంఘాల నాయకులు కోరారు.ఈ మేరకు బుధవారం జిల్లాలోని పార్వతీపురం, సీతానగరం, సాలూరు తదితర ప్రాంతాల్లో సీఐటీయూ, ఎస్ఎఫ్ఐతోపాటు పలు ప్రజాసంఘాల నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మహిళా రక్షణ చట్టాలను కఠినంగా అమలు చేయాలని డిమాండ్‌చేశారు. మహిళల భద్రత ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన వ్యక్తంచేశారు.

- ఆంధ్రజ్యోతి బృందం



సాలూరు: ఎస్‌హెచ్‌పై నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాలు



సీతానగరం: ర్యాలీ చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు



బెలగాం: ర్యాలీ చేస్తున్న సీఐటీయూ, ప్రజా సంఘాల నాయకులు

యాజమాన్య పద్ధతులతో అధిక లాభాలు

● జిల్లా వ్యవసాయశాఖ అధికారి రాబర్ట్‌పాల్

గరుగుబిల్లి : ఖరీఫ్‌లో రైతులు యాజమాన్య పద్ధతులను అవలంబిస్తే అధిక లాభాలు సాధించవచ్చని జిల్లా వ్యవసాయశాఖ అధికారి కె.రాబర్ట్‌పాల్ తెలిపారు. బుధవారం మండలంలోని సంతోషపురంలో గ్యాప్ పొలంబడిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పొలం గట్లపై కంది సాగుతో వరి పంటకు రక్షణతో పాటు అదనపు ఆదాయం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో కురుపాం వ్యవసాయ సహాయ సంచాలకురాలు నిర్మల్ జ్యోతి, ఏవో ఆర్.విజయభారతి పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడి

వీరఘట్టం: నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడి సాధించవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి రాబర్ట్‌పాల్ తెలిపారు.బుధవారం చిట్టిపుడివలసలో గ్రామీణ విత్తన ఉత్పత్తి పథకం గురించి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏడీఏకే రత్నకుమారి, ఏవో సౌజన్య, వీఏఏలు పాల్గొన్నారు.

15లోగా ఈ-క్రాప్ నమోదు చేయండి

కురుపాం రూరల్: ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను సెప్టెంబరు నెల 15లోగా పూర్తిచేయాలని ఏవో పి.నాగేశ్వరరావు ఆదేశించారు. బుధవారం కురుపాం ఆర్బీకేలో సచివాలయం అగ్రికల్చరల్ కార్యదర్శులతో మాట్లాడారు. ప్రతి కార్యదర్శి రోజుకు 50 ఎకరాల్లో ఈ-క్రాప్ నమోదు చేయాలన్నారు. పంటలు వేయకుండా వృథాగా ఉండే భూముల డాటా సేకరించాలని కోరారు.

రోడ్డు తానే తెచ్చానని చెప్పుకోవడం సిగ్గుచేటు

● సాలూరు పట్టణ టీడీపీ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు

సాలూరు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వత కోటీ 60 లక్షల రూపాయలతో మంజురు జరిగిన పారమ్మ కొండ బీటీ రోడ్డు తానే తెచ్చానని మాజీ ఎమ్మెల్యే రాజన్నదొర చెప్పుకోవడం సిగ్గుచేటని పట్టణ టీడీపీ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు (చిట్టి) విమర్శించారు. బుధవారం పట్టణంలో విలేకరులతో మాట్లాడుతూ బాధ్యత లేకుండా సుమారు 18 ఏళ్లు ఎమ్మెల్యేగా, ఉపముఖ్యమంత్రిగా ఉన్న మీరు మాకు, మా నాయకురాలు, మంత్రి గుమ్మిడి సంధ్యారాణికి బాధ్యతలు గురించి చెప్పడం సిగ్గుచేటని తెలిపారు. బాధ్యతతో పనిచేసి ఉంటే ఏకలవ్య పాఠశాల నిర్మాణం పూర్తి జరిగేదని, ఈ రోజు ఇద్దరు యువ ఉపాధ్యాయులు మృతిచెంది ఉండేవారు కాదని విమర్శించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ హర్ష, పప్పల మోహన్,డబ్బి కృష్ణచంద్ర పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

వీరఘట్టం: పట్టణంలోని ప్రియాంక ఫిల్లింగ్‌స్టేషన్‌లో అగ్నిమాపక అధికారి సర్వేశ్వరరావు ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాలపై బుధవారం అవగాహన కల్పించారు. పంపు ఆపరేటర్లు, సూపర్‌వైజర్లు, వినియోగదారులకు ప్రమాదాలు జరిగే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. కార్యక్రమంలో ఫిల్లింగ్ స్టేషన్ సూపర్‌వైజర్లు డొంక ప్రసాద్, పంపు ఆపరేటర్లు నాని, రాజేష్, కళ్యాణ్, మున్నా, చంటి, రవి, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

డిప్యూటీ వార్డెన్‌కు షోకాజ్ నోటీసు

పాలకొండ: పట్టణంలోని గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల డిప్యూటీ వార్డెన్ కె.ప్రవీణ్‌కుమార్ విధుల్లో అలసత్వం వహించడంతో ఐటీడీఏ పీవో వీవీ రమణ షోకాజ్ నోటీసు జారీచేశారు. ఇటీవల బాలుర ఆశ్రమ పాఠశాలను పాలకొండ తహసీల్దార్ తనిఖీ చేశారు.పాఠశాలలో మెనూ సక్రమంగా అమలుచేయకపోవడం,సరుకుల్లో నాణ్యత లోపించడం, భోజనం రుచికరంగా లేకపోవడం, పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడం వంటి అంశాలను గుర్తించి తన విచారణ నివేదికను ఐటీడీఏ పీవోకు సమర్పించారు. తహసీల్దార్ సమర్పించిన నివేదిక ఆధారంగా డిప్యూటీ వార్డెన్‌కు షోకాజ్ నోటీసు జారీచేసినట్టు పీవో తెలిపారు.

40 పాఠశాలల్లో ట్యాబ్‌లతో పరీక్షలు

భామిని:విద్యార్థులు పరీక్షలను ప్రశాంతంగా రాయాలని డీఈవో జి.పగ డాలమ్మ సూచించారు. బుధవారం భామిని ఆదర్శ పాఠశాల, అంబేడ్కర్ గురుకులం, కేజీబీవీ పాఠశాలల్లో ట్యాబ్‌ల ద్వారా నిర్వహించిన పరీక్షలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 40 పాఠశాలల్లో ప్రయోగాత్మకంగా సీబీఎస్ఈ స్టూడెంట్స్ అసెస్‌మెంట్ ట్యాబ్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు.దీంలో వచ్చిన ఫలితాల ప్రాప్తికి వార్షిక పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో భాస్కరరావు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బాబూరావు, బీఆర్ అంబేడ్కర్ గురుకులం ప్రిన్సిపాల్ విజయనిర్మల, కేజీబీవీ ప్రిన్సిపాల్ భాగ్యవతితోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

ఎయిమ్ ఫర్ సేవ ఆశ్రమం పరిశీలన

సీతానగరం: లచ్చయ్యపేటలోని ఎయిమ్ ఫర్ సేవ ఆశ్రమాన్ని కలెక్టర్ ఆదేశాలమేరకు బుధవారం ఎంఈవో సూరిదేముడు సందర్శించారు. భోజనాలు, విద్యపైవిద్యార్థులతో మాట్లాడారు. అనంతరం మధ్యాహ్న వంటకాలను పరిశీలించారు.

మెనూ ప్రకారం భోజనాలు పెట్టాలి

సీతానగరం (బలిజిపేట) : ఆహార పదార్థాలను రుచి చూసి ప్రతి రోజూ మెనూ ప్రకారం రుచికరంగా భోజనాలు పెట్టకపోతే చర్యలు తప్పవని సిబ్బందిని ఎంపీడీవో విజయలక్ష్మి, ఎంఈవో-1 సావల సింహాచలం హెచ్చరించారు. బలిజిపేట మండలంలోని వంతరాం కస్తూర్బాగాంధీ విద్యాలయంలో బుధవారం పీఎం పోషణ భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. భోజనం బాగోడంలేదని బాలికలు ఫిర్యాదు చేయడంతో భోజనశాలను తనిఖీచేశారు. నాణ్యమైన విద్యా బోధన అందించాలని కోరారు. విద్యార్థినులకు సరిపడే వసతి, భవనాల కొరత ఉందని గుర్తించామని, ఈ సమస్యను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని ఎంఈవో తెలిపారు.కార్యక్రమంలో రెవెన్యూ సహాయకులు తిరుమలరావు, ఎస్‌వో మధురవాణి, టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

జియ్యమ్మవలస: మండలంలో చినమేరంగి ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకుడిగా ఎంపికైన వి.గౌరీశంకరరావుకు కళాశాలలో చినమేరంగి ఎస్ఐ ఇ.చిన్నంనాయుడు, ప్రిన్సిపాల్ ఎస్.రమణ, అధ్యాపకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్ఐ చిన్నంనాయుడు విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో సైబర్ నేరాల గురించి విద్యార్థులకు వివరించారు.

పంచాయతీ కార్యదర్శి మృతి

జియ్యమ్మవలస: మండలంలోని కుందరతిరువాడ పంచాయతీ కార్యదర్శి, కొండచిలకాం పంచాయతీ డ్రాక్షిణికి చెందిన మండంగి సుగ్రీవులు (33) బుధవారం మృతిచెందారు. ఆయనకు భార్య తోయక రజని, ఎనిమిది నెలల కుమారుడు ఉన్నారు. కొద్దినెలలుగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. బుధవారం పార్వతీపురంలో ఉపాధిపీడీతో సమావేశమైన తర్వాత ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటానని చెప్పి వెళ్తుండగా మార్గమధ్యలో మృతిచెందారు. డ్రాక్షిణిలో విషాదం నెలకొంది. పలువురు కార్యదర్శులు ఆయన మృతికి సంతాపం తెలియజేశారు.

సమస్యలను పరిష్కరించండి: ఎమ్మెల్యే



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

పార్వతీపురం రూరల్: సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ఆదేశించారు. మండలంలోని వెంకంపేట పంచాయతీ పరిధిలో గల ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ప్రజల ఉంచి వివిధ సమస్యలను వినతులు స్వీకరించారు. ఉపాధి లేకుండా వైసీపీ నాయకులు అన్యాయం చేశారని పలువురు ఫిర్యాదు చేశారు. ఈ కార్య క్రమంలో టీడీపీ నాయకులు బార్నాల సీతారాం, పెంకి వేణుగోపాలనాయుడు, వేణు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించాలి

సీతంపేట రూరల్: గిరిజన క్రీడాకారులను ప్రోత్సహించాలని సీతంపేట ఎస్ఐ జగదీష్‌నాయుడు కోరారు. బుధవారం మండ, జక్కరవలస, ఉప్పరజమ్మి, కొత్త పనుకువలస,సీతంపేటలోని క్రీడాకారులకు కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా వాలీబాల్ కిట్టుతో పాటు స్పోర్ట్స్ టీషర్ట్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రైటర్ గురుమూర్తి,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏడుగురు పేకాటరాయుళ్లపై కేసు నమోదు

కొమరాడ: మండలంలోని గంగభద్ర సమీపంలో కొండ వద్ద పేకాట ఆడుతున్న ఏడుగురిపై కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ నీలకంఠం తెలిపారు. సమాచారం మేరకు బుధవారం సిబ్బందితో దాడిచేసినట్లు చెప్పారు. ఈ మేరకు ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.47 వేలు సీజ్‌చేసి కేసు నమోదుచేసినట్లు చెప్పారు.

డీఎస్సీ కోచింగ్ కోసం దరఖాస్తులు

పార్వతీపురం ఆంధ్రజ్యోతి: పార్వతీపురం ఐటీడీఏ పరిధిలోని గిరిజన అభ్యర్థులకు డీఎస్సీ కోచింగ్ ఇవ్వడానికి నిర్ణయించినట్లు పార్వతీపురం ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో ఎస్.ఎస్.శోభిక ఒక ప్రకటనలో తెలిపారు. డీఎస్సీ కోచింగ్ అనుభవం, ఎక్కువ ఉత్తీర్ణతా శాతం కలిగిన సంస్థలు, వ్యక్తులు స్టడీ మెటీరియల్‌తో సహా పూర్తి వివరాలతో దరఖాస్తులను ఐటీడీఏలోని పీఎంఆర్‌సీకి ఈనెల 27వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోగా సమర్పించాలని కోరారు. వివరాలకు 9441606731, 7013196555 నెంబర్లకు సంప్రదించాలని సూచించారు. అభ్యర్థులకు స్టడీ మెటీరియల్ కూడా అందజేస్తారని, శిక్షణ రెండున్నర నెలల నుంచి మూడు నెలలు ఉంటుందని తెలిపారు.

నేడు డీఎస్సీ ఎంపిక పరీక్ష

సీతంపేట రూరల్: డీఎస్సీ ఉచిత కోచింగ్‌కు సంబంధించి ఎంపిక పరీక్షకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. స్థానిక వైటీసీలో గురువారం ఉదయం 11 గంటలకు డీఎస్సీ ఎంపికపరీక్ష జరుగుతుందని ఐటీడీఏ ఇన్‌చార్జ్ పీవో వీవీ రమణ తెలిపారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు పూర్తిచేసినట్లు చెప్పారు. వైటీసీలో నిర్వహించనున్న పరీక్షకు సంబంధించిన ఏర్పాట్లను బుధవారం ఏపీవో చినబాబు పరిశీలించారు.

రేపు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సమీక్ష

పార్వతీపురం ఆంధ్రజ్యోతి: రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖమంత్రి సత్యకుమార్‌యాదవ్ శుక్రవారం జిల్లాలో పర్యటించనున్నారని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 9.40 గంటలకు జిల్లాకు చేరుకుంటున్నారని, ఉదయం 10 గంటలకు బందులప్పి పీహెచ్‌సీలో తనిఖీచేస్తారని పేర్కొన్నారు. 11 గంటలకు జిల్లా ఆసుపత్రిని సందర్శించిన అనంతరం వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సమీక్షిస్తారని తెలిపారు.

రేపు సామూహిక కుంకుమ పూజలు

మక్కువ: శంబర పోలమాంబ అమ్మవారి చదురు గుడిలో శ్రావణమాసం శుక్రవారం సామూహిక కుంకుమపూజలను నిర్వహించనున్నట్లు ఈవో వీవీ సూర్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.



గ్రామసభలు విజయవంతంగా నిర్వహించాలి

పార్వతీపురం రూరల్:జిల్లాలో గ్రామసభలు విజయవంతంగా నిర్వహించడంలో ఎంపీడీవోలు, ఉపాధి హామీ పథకం సిబ్బంది కీలకంగా వ్యవహరించాలని డుమా పీడీ రామచంద్రరావు కోరారు. బుధవారం పార్వతీపురంలో కురుపాం నియోజకవర్గ పరిధిలోని మండలాలకు చెందిన ఎంపీడీవోలు, ఉపాధి హామీ పథకం అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు.

● గరుగుబిల్లి: మండలంలో శుక్రవారం నిర్వహించనున్న ఉపాధి గ్రామసభలను విజయవంతం చేయాలని ఎంపీడీవో జి.పైడితల్లి కోరారు. గరుగుబిల్లిలో విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని 25 పంచాయతీల పరిధిలో ఉదయం తొమ్మిది నుంచి 11 గంటల వరకు విధిగా సభలు నిర్వహించాలని కోరారు.

● సీతానగరం:జోగింపేటల జరగబోయే గ్రామ సభలపై ప్రజలకు, వేతనదారులకు అవగాహన కల్పించినట్లు ఉపాధి హామీ పథకం ఏపీవో భానుప్రసాద్ తెలిపారు. బుధవా రం సీతానగరంలో గ్రామసభలపై అవగాహన కలించారు.

ఆన్‌లైన్ మోసాలపై అవగాహన

బెలగాం: ఆన్‌లైన్‌లో జరుగుతున్న మోసాలు గురించి స్థానిక ఐసీఐసీఐ బ్యాంకు ఆధ్వర్యంలో బ్యాంకు మేనేజర్ శంగుపాలు గున్నరు ఆధ్వర్యంలో వరల్డ్ సీనియర్ సిటిజన్స్ డే పురస్కరించుకుని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు గంటా జగన్నాథంనాయుడు, కార్యదర్శి గణపతిరావు తదితరులు పాల్గొన్నారు.



